# వరమిచ్చిన వేలుపు



**కోవెల మంటపం మెట్లమీద కూర్చొని శ్రావ్యంగా పాడుతోంది శార్వరి.**

**నిర్మానుష్యంగా ఉన్న ఆలయంలో ఆమె గానానికి చిరుగంటల సవ్వడులూ.**

గోపురంపై కాపురాలుండే పావురాయి జంటల కువకువలూ పున్నాగ, సువర్ణగన్నేరు, ముద్దమందారం, నందివర్ధనాల పూలవాసనలు మోసుకొస్తూ పిల్లాలి వేసే అల్లరి ఈలలు

ఇవే... ఇవే... ఆమె గానానికి తాళవాయిద్యాలు

సాయంకాలపుహారతి ఇచ్చి వెనక్కి తిరిగారు గోవర్ధనాచార్యులు.

అక్కడ

భక్తులెవరూ లేరు.

ఆయన ఒక్కక్షణం హారతిపళ్లెం వైపు, తలతిప్పి కోదండరాముడి వైపుచూసి నిట్టూర్చి హారతి పళ్లాన్ని గట్టుపై ఉంచి భగవంతుడికో నమస్కారం చేసి గర్భగుడిలోనుండి మెల్లగా నడుస్తూ బైటికొచ్చాడు.

గుడిబైటంతా బండపరుపు వేయబడివుంది. చుట్టు ప్రహారీ ఎర్రమట్టి పూతపై తెల్లచారలతో దేవాలయ ప్రత్యేకతను చూపుతోంది. ప్రహారీనానుకొని అనేక రకాల పూల చెట్లు స్వామికి తమనర్పించుకోవడానికి తహతహలాడుతున్నట్లు విరగబూచి ఉన్నాయి.

చెట్లమీద, గోపురం మీద ఉన్న పావురాళ్ల చప్పుడుతో, శార్వరి గానం ఆ నిశ్శబ్దంలో ఆయన మనస్సుకి కొంత ఊరట కలిగించింది.

ఇంత ఆహ్లాదకరమైన వాతావరణంలో కొద్దిసేపైనా గడపాలని ఈ జనం అనుకోరెందుకు?

ఉదయం లేచింది మొదలు సాయంకాలం దాకా, బ్రతుకుపోరాటంలో ఒడిదుడుకులతో, పరుగు పందెం లాంటి జీవనగమనంలో అలిసిపోతూ వేగిపోయే మనస్సుకి ఈ పరిసరాలెంత ఆహ్లాదాన్నిస్తాయి?

ఒక్క ఐదునిమిషాలు ఈ ప్రదేశంలో కూర్చుంటే మనసుకెంత ప్రశాంతత లభిస్తుంది?

సాయంకాలం టీవీలు, రేడియోలు ఇచ్చేపాటి మానసికానందం ఈ వాతావరణం ఇవ్వడం లేదా?

ఎక్కడుందిలోపం! గుడికి ఇదివరలోలా భక్తులెవరూ ఈ మధ్యకాలంలో రాకపోవటానికి కారణమేమిటి?

ప్రజల్లో భక్తి నశించిందా?

దేవుడిపై నమ్మకం పోయిందా?

ఎంత ఆలోచించినా ఆచార్యుల వారికి భక్తులెవ్వరూ రాకపోవటానికి కారణం కన్పించడం లేదు.

శార్వరి పాడుతూ దేవుడికి పూలమాల

అడివి సూర్యకుమారి

కడ్తోంది.

నలుగురు ఆడవాళ్లు పిల్లల్తో గుడికొచ్చారు. ప్రదక్షిణాలు చేసి లోపలికి వచ్చినవారికి తీర్థ ప్రసాదాలిచ్చాడు.

వారవి పుచ్చుకుని వెలుపలికొచ్చి కూర్చున్నారు. ఆచార్యులవారు వెలుపలికొచ్చి వారి యోగక్షేమాలు విచారించాడు. ఓ పావుగంట తమ సాధక బాధకాలు ఆయనతో వెళ్లబోసుకుని "వెళ్తాం ఆచారిగారు' అని బైలుదేరారు వాళ్లు.

వాళ్లు వెళ్లి గంటగడచినా ఒక్కరూ రాలేదు.

శార్వరి పూలదండ ఇచ్చి వెళ్లిపోయింది.

గుళ్లో దేవుడూ, ద్వారానికానుకుని తనూ తప్ప మరెవ్వరూ లేని అత్యంత నిశ్శబ్దం.

ఆయన మనసు తన ఇంటివైపు మళ్లింది.

పట్నంలో కాపురంపెట్టి వృద్ధులైన తల్లిదండ్రులకి పైసాకూడా పంపని పెద్ద ఉద్యోగ్థుడు తన కొడుకు .ఉన్న ఆస్తినంతా తెగనమ్మి కొడుకుని గొప్పవాడిని చేశానని ఆనందించా డానాడు.

ఆ ఆనందం హారతి కర్పూరంలా హరించుకుపోయింది.

.పెద్ద హోదానిచ్చే ఉద్యోగం, కొత్తగా కాపరానికొచ్చిన భార్య తప్ప అతనికి మరేమీ అక్కర్లేదు.

అమ్మా,నాన్న,చెల్లి,తమ్ముడు, ఇప్పుడు అతనికి గుర్తు కూడాలేరు. బహుశః ఊరిపేరు కూడా మరచిపోయుంటాడు.

హైస్కూలు చదువుతో ఆగిపోయి కళ్యాణఘడియకై కలలుగనే కూతురూ

కాలేజీలో చేర్తానంటూ డబ్బుకై ప్రాణం పీక్కుతినే కొడుకూ ఆయన బాధ్యతల్ని, బరువుల్ని గుర్తుచేస్తూ జయవిజయుల్లా ఆయన కళ్లముందు మెదుల్తున్నారు.

ఈ భవబంధాలకి విముక్తి ఎన్నటికి?

బాధాతప్తమైనప్పుడు మనసు బాధ్యతల్ని ధైర్యంగా ఎదుర్కోవా లనదు. పలాయన వాదంవైపుకి మొగ్గుతుంది.

అడుగడుగునా ఆర్థిక ఇబ్బందులు, గౌరవమర్యాదలు లేని వృత్తి అయినా తనీ కోదండరాముడి సేవ మానలేదు. తమ పూర్వీకులంతా ఈ స్వామి సేవలోనే తరించారు.

కానీ... వారి కాలం వేరు. ఆ మనుష్యులు వేరు.

ఆ భక్తిప్రపత్తులు, విశ్వాసాలు నేడేవి?

ఉత్సవాలు, పూజలు శుద్ధదండగ. డబ్బు వృధా చేయడం తప్ప దేవుడికి కళ్యాణం ఏమిటి? ఉత్సవం ఏమిటి? అని అన్నింటిని నిలిపివేశారే!

కాని... ఆ ఉత్సవాలు, పూజల మూలంగా ప్రజల్లో ఆధ్యాత్మిక చింతన కలుగుతుందని, భగవంతుడిపై భక్తి విశ్వాసాలు ఏర్పడతాయని చెప్పినా ఎవరు వింటారు?

కాగా గేలిచేస్తున్నారు.

'పూజారి తినేందుకే ఇవన్నీ' అని నిందలు మోపుతున్నారే!

ఈ పూజారి పదవిలో ఏం దక్కుతోంది తనకి? నెలకి రెండు వందల యాభైరూపాయల జీతం. అది ఏమూలకి సరిపోతుంది!

రోజూ హారతిపళ్లెంలో డబ్బులొస్తాయిగా! అంటారు.

ఏవి! ఎందరు గుడికొస్తున్నారు? వచ్చినా వాళ్లల్లో ఎందరు కానుక (డబ్బులు) వేస్తారు!

వాటితోనే నా జీవితం నడుస్తుందా? ఎవరాలోచిస్తారు నాబాధ!

దేవుడి మాన్యం ప్రభుత్వం లాక్కుంది. ఆ ఆదాయం కూడా లేదిప్పుడు.

అయినా...తనెప్పుడూ భగవంతుడి అస్తిత్వాన్ని ప్రశ్నించలేదు.

ఆయనకరుణపై నమ్మకం తగ్గలేదు. అంతా వాడిలీల అని ఆ కోదండ రామునే నమ్మి కొలుస్తున్నాడు.

'ఆచారిగారూ!'

ఆ పిలుపుతో ఆలోచనల్లో నుండి బైటపడ్డాడాయన.

ఎదురుగా పరమేశ్వరశాస్త్రి.

'ఎంతసేపయింది వచ్చి'

ఆచారిగారి మొహంలో కొంత రిలీఫ్. శాస్త్రిగారు మటుకు ప్రతిరోజూ సాయంకాలం ఠంచనుగా ఎనిమిదయ్యే సరికి గుళ్లో ఉండాల్సిందే. ఓ అరగంట ఆచార్యుల వారితో కష్టం సుఖం మాట్లాడుకుని ఆ ఆవరణలో కూర్చుని, ఆగాలి పీల్చందే ఆయనకు తోచదు. గుడి తలుపులు వేసేదాకా తనకి తోడుండే శాస్త్రిగారంటే ఆచార్యుల వారికి అభిమానం.

'ఇప్పుడే వచ్చాను. మీరేమిటి అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నారూ?'

'జీవితచక్రం ఎన్నిరంగులు మారుతోందా! అని'

'నిజం చెప్పారు? రోజురోజుకి మారిపోయే ఈ వ్యవస్థలో నిజాయితీగా బ్రతకాలనుకోవడం ఎంత కష్టమో అనుభవపూర్వకంగా తెలుసుకుంటున్నాను. ఈ పరిస్థితుల్ని వాతావరణాన్ని చూస్తుంటే ప్రపంచం ముందుకుపోతోందా లేక ఆటవిక నాగరికత నాటి రోజులకి వెనక్కి వెళ్తోందా? అన్పిస్తోంది'

'ఏమిటో, మీరివాళ చాలా భారంగా మాట్లాడుతున్నారు రండి' అని లోపలికి నడిచాడు ఆచార్యులు.

తీర్థప్రసాదాలు పుచ్చుకున్నాక మంటపంపై మెట్టుపై ఆచార్యుల వారు, కింది మెట్టుపై శాస్త్రి కూర్చున్నారు.

'ఇప్పుడు చెప్పండి. ఏమిటి మీ ఆవేదన?' అడిగాడు ఆచార్యులు.


"శాస్త్రిగారు కొద్దిక్షణాలాగి "నా ఊహ తెలిసినప్పటి నుండి ఈ గుడి కొస్తున్నాను. నేనేనాడు ఆస్వామిని ఏ కోరికా కోరలేదు. కాని...ఏడాది కిందటి నుండి రోజూ అడుగుతున్నాను. మా శంకరానికి ఉద్యోగం ఇప్పించి నా ఇబ్బందులు తగ్గించమని. ప్రతినిత్యం ప్రార్థిస్తున్నాను. ఇంజనీర్ చదివాడు. ఏడాది దాటింది ఉద్యోగం రాక. విరక్తితో వాడేం చేసుకుంటాడోనని నా మనసు తల్లడిల్లిపోతోంది. ఎంత ప్రార్థించినా ఆ రాముడి కింకా మాపై కరుణ కలుగలేదంటే ఆ భగవంతుడసలు ఉన్నాడా...'

"ఆ... ఆ... శాస్త్రీ. ఆపదలొచ్చాయి గదాని ఆది దేవుడి అస్తిత్వాన్నే శంకిస్తున్నావా? తప్పునాయనా! దేనికైనా సమయం రావాలి"

"మామూలు బడిపంతుల్ని, ఆ జీతపురాళ్లతోనే ఆడపిల్లలిద్దరి పెళ్లిళ్లు చేసేసరికి పెద్దలు కన్పించారు. ఒక్క మగపిల్లాడని గారాబం చేసినా వాడు బుద్ధిమంతుడు, బాగా చదువుకొని స్కాలర్‌షిప్పులతో ఇంత చదువు నెట్టుకొచ్చాడు. ఉద్యోగం కొంటానికి నా దగ్గర డబ్బేది! నేనే మంత్రి సిఫారసు తేగలను?" నిస్సహాయత శాస్త్రి గొంతులో ప్రస్ఫుటంగా కన్పిస్తోంది.

ఆచారిగారు నవ్వి 'వెర్రివాడా! రాముడే నీకు సిఫారసు చేస్తాడు. ఆయన్ని నమ్మిన వారికెన్నడైనా అన్యాయం జరిగిందా! దేనికైనా కాలం కూడా కలసిరావాలి కదా! మనసు కుదుటపరచుకో -ఊ... అయితే శంకరం ఉద్యోగానికై బాగా ప్రయత్నిస్తున్నాడన్న మాట'

'ఏం ప్రయత్నాలో! అప్లికేషన్లు పెడుతూనే ఉన్నాడు. ఇంటర్వ్యూలకెళ్తూనే ఉన్నాడు. ఏం ప్రయోజనం! మొన్న నొక మోటార్ కంపెనీకి అప్లయి చేశాడు. ఎవరో గోపాలచెట్టియార్‌ట. ఆయన చెబితే పని జరుగుతుందని తెలిసింది. ఆయన మనఊరివాడేనని ఈ గుడిట్రస్టీల్లో ఒకరని తెలిసింది. కానీ... వారినెన్నడూ ఊళ్లోనే చూళ్లేదు. ఆయన చెబితే అవుతుందిగా



ని... అంతవారితో నేనేం మాట్లాడగలను, వారి దగ్గ రికి ఒట్టి చేతులతో పోతే పల్లయే రోజులా యివి. పదిహేను రోజుల్లో ఇంటర్వ్యూ ఉందిట. అంతా వా డి అదృష్టం. నేనేం చేయగలను? ఆ దేవుడికో నమ స్కారం తప్ప'

'నమ్మి చెడినవా ఋ లేదు శాస్త్రీ' అన్నారు ఆచారి గారు. శాస్త్రికి దేవుడిపై నమ్మకం పోతోంది. ఈ మాత్రం గుడికొచ్చే మనిషి కూడా తనకిక కరువా?

రేపి ఇంటర్వ్యూలో కొడుకు సెలక్ట్ కాకుంటే శాస్త్రి మళ్లీ గుడిమొహం చూస్తాడా?

భక్తులు రకరకాలు.

అర్థాపేక్షతో, లౌకిక కాంక్షలతో కొందరు ప్రార్థిస్తే

జ్ఞానాపేక్షతో మరికొందరు ప్రార్థిస్తారు.

ఇలా భక్తులంతా ఒకటే విధంగా భగవంతుడిని ప్రార్థిస్తున్నారు, తమ కోర్కెలు తీర్చమని. కాకపోతే ఆ కోర్కెల తారతమ్యాల తీరులోనే మార్పు.

కాబట్టి శాస్త్రి భగవంతుడిని తనకొడుక్కి ఉద్యోగ ం ఇప్పించమని కోరుకుంటూ ప్రార్థించడంలో తప్పే మిటి? అతని ప్రార్థనలో లోపంలేదు. అందరూ చేసే పనే అతనూ చేస్తున్నాడు. అతడు దేవుడిని ప్రార్థించ డంలో స్వార్థం ఉంది. కాని అసలది లేనిదెవరికి?

గోపాలచెట్టియార్ పేరు ఆయన మనసులో పదే పదే మెదలసాగింది.

''నడుద్దామా ఆచారిగారూ!'' శాస్త్రి పలకరించ టంతో ఆచారి ఆలోచనాపి గుడికి తాళం వెయ్యడా నికి లేచారు.

''మీరీ రోజు సరిగ్గా లేరు'' అన్నాడు శాస్త్రి.

''ఔను. ఏవో గృహఛిద్రాలు. మానవ మాత్రుల ం, తప్పవుగా!'

అంటూ గుడి తలుపులు లాగివేసి తాళం వేశాడా యన.

అప్పటికి సరిగ్గా ఎనిమిది గంటలు దాటిందనటా నికి గుర్తుగా మసీదులో నమాజు వినిపిస్తోంది.

ఇద్దరూ బైటికొచ్చారు.

గుడిబైట రావిచెట్టు కింద గుడ్డివాడు కూర్చుని ఉన్నాడు.

ఆచారిగారు వాడి బొచ్చెలో పదిపైసల బిళ్లవేశా రు.

వాడది తడుముతూ ''దేవుడికి భక్తులు కరువైన ట్లుంది స్వామీ'' అన్నాడు.

ఆచారి, శాస్త్రి నవ్వుకుంటూ ముందుకు నడిచా రు.


మర్నాడు సాయంకాలం కనుచీకటి పడ్డాక దేవుడి కి హారతి ఇచ్చి వాకిట్లోకొచ్చి నిలబడ్డారాచారి గారు.

ఇంతలో బైట మేళతాళాల చప్పుళ్ళు.

'ఏమిటీ హడావిడి రామనాథంగారూ' అన్నాడు ఆచారి.

రామనాథం మెడలో పూలదండలు చూసి.

''రాబోయే ఎలక్షన్లలో నేను ప్రెసిడెంట్‌గా పోటీ చేసేందుకు ఇప్పుడే నామినేషన్ వేసేను. రాములవా రి ఆశీర్వాదం కోసం వచ్చాను. నా పేరుతో అష్టోత్తర ం చేయించండి స్వామివారికి' అనగానే పక్కనే ఉన్న




వాడొకడు సంచీలోనుండి రెండు కొబ్బరి కాయలు, ఊదుకడ్డీలు, అరటిపళ్లు తీసి అక్కడే ఉన్న ఇత్తడి పళ్లెంలో పెట్టాడు.

'చాలా సంతోషం' అంటూ ఆచారిగారు పళ్లెం తీసుకెళ్లి లోపల దేవుడికి అష్టోత్తరం చేసి ప్రసాదం తీసికొని బైటికొచ్చాడు.

ప్రసాదం ఇచ్చి 'ఇష్ట కామ్యార్థ సిద్ధిరస్తు' అని రామ నాథాన్ని ఆశీర్వదించాడు ఆచార్యులు వారు.

రామనాథం ఆనందంగా 10 రూపాయల నోటు పళ్లెంలో ఉంచాడు.

అలాగే నామినేషన్లు వేసిన వాళ్లు ఒకరి తర్వాత ఒకరుగా వచ్చి అష్టోత్తరాలు చేయించి వెళ్లిపోయారు. ఇందరు భక్తులు రావడంతో ఆయనకి చాలా ఆనందం గా అనిపించింది.

ఇంతలో శాస్త్రి వచ్చాడు.

''ఏమిటో గుడి అంతా సందడిగా ఉన్నట్లుందే'' అన్నాడు.

ఆరోజు పూజాకార్యక్రమాలగురించి, అనేక మ ంది భక్తులు గుడికి రావడం గురించి చెప్పాడు ఆచారి,

ఇంటికి వెళుతూ గుడిబైట చెట్టుకింద కూర్చు న్న గుడ్డివాడి బొచ్చెలో నాల్గరటి పళ్లు, ఒక కొబ్బరి చిప్ప వేశాడు ఆచారి.

''ఈ రోజు దేవుడికి చాలా దొరికినట్లున్నాయే ఆచారిగారూ!'' అన్నాడు గుడ్డివాడు తడుముకుం టూ'' ఎలక్షన్లు గదా బాబూ అన్నాడు తనే మళ్లీ.

ఆచారిగారు నవ్వి వెళ్లిపోయారు.

ఎలక్షన్లు జరిగే దాకా నామినేషన్లు వేసిన వారంతా తరచూ గుడికొచ్చి పూజలు జరిపిస్తున్నారు. గుడి అగరుధూపాలతో, అష్టోత్తర సహస్ర నామాలతో, భక్తబృందాలతో అట్టహాసంగా కళ కళలాడ్తోంది.

గోవర్ధనాచార్యులకి మహదానందంగా ఉంది. ఈ ఎలక్షన్లు ఎప్పుడూ ఉంటే బావుణ్ణు అనుకున్నాడాయ న.

గుడ్డోడికి ఎలక్షన్ల రోజులన్నీ పండగరోజులే అ య్యాయి.

ఎలక్షన్లు అయిపోయాయి. ఓడినవాడెలాగూ రా డు. కనీసం గెలిచిన వాడైనా వచ్చి పూజ చేయిస్తాడను కున్నా రాచారి గారు.

కాని... గెలిచిన రామనాథం మళ్లీ దేవుడి మొహం చూళ్లేదు.

గుడి యథాప్రకారం నిర్మానుష్యంగా ఉంది.

శాస్త్రి మామూలుగా వచ్చాడు. ప్రసాదం పుచ్చు కున్నాక బైటికొచ్చారు. శాస్త్రి దిగులుగా ఉన్నాడు. అతని కొడుక్కి ఉద్యోగం ఇప్పించే ఏర్పాటుచేసి ఆ ఒక్క భక్తుడిని అయినా నిలుపుకోవాలనుకున్నాడు ఆచారి,

బైటి కొచ్చారిద్దరూ.

గుడ్డోడి బొచ్చెలో ఐదుపైసలు వేశారు ఆచారిగా రు.

వాడది తడుముతూ 'ఏం బాబు! ఎలక్షన్లయి పో యాయి గదా! ఇంకీ రాముడు మళ్లీ ఐదేళ్ల దాకా అరికి అక్కర్లేదులెండి' అన్నాడు గుడ్డోడు.

ఆచారిగారు తన ఆలోచనని ఆచరణలో పెట్టా లనుకున్నారానాడు. అందుకే ఏనాడూ ఊరుదాటి ఎరుగని ఆచారిగారు తనింటికొచ్చారని చాలా గౌరవి ంచాడు చెట్టియార్. కుశలప్రశ్నలయ్యాక తనొచ్చిన పని బైటపెట్టాడు ఆచారి,

చెట్టియార్ గారు ఆలోచించసాగాడు.

'ఏదో మన ఊరి కుర్రాడు. చదువుకుని అభివృద్ధి లోకొచ్చాడు. మీరే దయతో వాడి జీవితానికో దారి చూపిస్తే రోజూ మీపేరు చెప్పుకుని ఓ ముద్ద తింటా డు. మీరు మా ఊరివారు కాబట్టే ఇంతగా చెప్పాను' అడిగారాయన.

'అవుననుకోండి. కుర్రాడు అప్లయి చేశాట్టా?' అ డిగారాయన.చేశాట్టండీ. ఇంటర్వ్యూ కూడా రెండు రోజుల్లో కొచ్చిందిట'

'పేరేమిటి?'


'అవధానుల శంకరనారాయణ'

'సరే! నేను చూస్తాలెండి'

'చాలు! మీరామాట అన్నారంటే మా శంకరానికి ఉద్యోగం వచ్చినట్టే. శతకోటి ధన్యవాదాలు, మరి నేను శలవు తీసుకుంటాను'

ఇతరుల కోసం ఆయన పడే తాపత్రయం చూస్తే ముచ్చట వేసింది చెట్టియార్‌కి.

''మంచిది మీరు మా ఇంట్లో ఏమీ తీసుకోరాయె రాకరాక వచ్చారు. ఈ పండ్లయినా తీసుకోండి' అని చెట్టియార్ పండ్లు ముందుచాడు. వాటిని సంచీలో




వేసుకొని బైటి కొచ్చారు ఆచారిగారు.

ఆ తర్వాత వరసగా వారం రోజులు శాస్త్రి కోసం ఎదురు చూశారు ఆచారిగారు.

ఎంక్వయిరీ చేయగా వారి కుటుంబం అంతా పట్నం వెళ్లిపోయారని తెలిసింది.

విషయం తెలుసుకుని చాలా బాధపడ్డాడు ఆచారిగారు.

ఎందుకంటే ఠంచనుగా ప్రతిరోజూ వచ్చే ఒక్కగా నొక్క భక్తుడు దూరమయ్యాడు.

అతని కొడుక్కి ఉద్యోగం వచ్చిందని ఈ విషయం తెలిసిన మర్నాడే శాస్త్రిగారు కుటుంబంతో పట్నం వెళ్లిపోయారని తెలిసింది. శంకరానికి ఉద్యోగం వచ్చినందుకు సంతోషమనిపించినా,

కనీసం చెప్పనైనా చెప్పకుండా శాస్త్రిగారు వెళ్లిపోయినందుకు మనస్సులో కష్టమన్పించింది ఆచారిగారికి.

రోజులు యాంత్రికంగా దొర్లిపోతున్నాయి.

చిన్నకొడుకు ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు.

కూతురికి సంబంధాలు చూస్తున్నాడు ఆచారి, ఒకరోజు

పట్నానికి రెండు రోజుల క్రితం ఇంటర్వ్యూ కని వెళ్లిన చిన్నకొడుకు వచ్చాడు సంబరంగా.

'నాన్నా. శుభవార్త. నాకు ఉద్యోగం వచ్చింది. రేపే జాయిన్ కావాలి. మనం ఈ రోజే వెళ్లిపోవాలి. నాకక్కడ కంపెనీవాళ్లు క్వార్టర్స్ ఇచ్చారు. అక్కడే ఉండాలి'' అన్నాడు.

''మేమెందుకురా అక్కడికి వద్దులే'' అన్నాడు ఆచారి.

'కాదునాన్నా! ఈ వయసులో మిమ్మల్నిలా వదిలి వెళ్లను.

అమ్మ ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉంది. పట్నంలో మంచి డాక్టరికి చూపిద్దాం. చెల్లాయికి అక్కడైతే మంచి సంబంధం దొరుకుతుంది. మనకన్ని విధాలా అక్కడ బావుంటుంది నాన్నా.''

ఆచారిగారు భార్యవైపు, కూతురివైపు చూశారు వాళ్ల మొహాలు పట్నం వెళ్దామంటున్నాయి.

'అన్నయ్యతో వెళ్దాం నాన్నా' అంది కూతురు శార్వరి.

'మీ ఇష్టం' అంది ఆయన భార్య.

ఇది జరిగిన మూడు రోజుల తర్వాత ఎవరో ఒక భక్తుడు గుడికొచ్చాడు.

గుడి తలుపులు వేసి ఉన్నాయి. ఆయన గుడి చుట్టూ తిరిగి చూసి ఎవరూ కన్పడక పోవడంతో బైటికొచ్చాడు.

చెట్టుకింద కూర్చున్న గుడ్డివాడు కన్పించాడు. వాణ్ణి అడిగాడు. ''ఏరా! గుడ్డోడా! పూజారిగారు రాలేదేంట్రా ఇంకా:''

గుడ్డోడు నవ్వి ''కోదండరాముడికిన్నాళ్లూ భక్తులే కరువూ. ఇప్పుడు పూజారి కూడా కరువేనయ్యా!

'అదేమిట్రా!' ఆశ్చర్యంగా అర్థంగాక అడిగాడు.

'ఔను బాబూ!' ఆ కోదండరాముడు అందరికోరికలతో పాటు ఆచారిగారి కోరిక కూడా తీర్చినట్లుంది. అందుకే ఆయన ఈ దేవుణ్ణి వదిలి వెళ్లిపోయాడు.

''మరి భక్తులూ రాక, పూజారి లేక నువ్విక్కడెందుకు రా! నీకేం పని?'' వ్యంగ్యంగా అడిగాడు.

''అదేంటి బాబూ! వాళ్లందరికీ దేవుడు సిఫారస్ చేశాడు గాబట్టి, వాళ్ల వాళ్ల కోరికలు తీరాయిగనక మళ్ళీ ఆయన మొహం చూడకుండా వెళ్లిపోయారు. నా కోరిక తీరేది కాదు కాబట్టి నేనీ కోదండరాముడికి పర్మెంటు భక్తుణ్ణి''

''అదేంట్రోయ్! నీకూ కోరికుందా! ఏంటది!''

''నాకు కళ్లు రావాలని''

తెలుగువారి
అభిమాన హాస్యపత్రిక



హాస్యప్రియ

తాజా సంచిక
మీరు చూశారా? భలే వారండీరా! ఇంకా ఆలస్యం చేస్తే బజార్లో మీకు కాపీ దొరకదర్రోయ్! ఎంచేతంటావ్ దీన్లో బోలు బాపు బొమ్మలు కళాప్రపూర్ణ బాపుని



అభినందిస్తూ ఆచాల గోపాళంతోసహా అనేక మంది పెద్దల సందేశాలు ప్రత్యేకరచన్లు, మల్లాది సాయి, పుచ్చాల హాస్య రచనలు, భమిడిపాటి నవ్వులపాతర, ఇరిష్ జోకులు-ఇలా ఎన్నో- కాపీ నాల్రోపాయలే-జేబుల పరిగెట్టుండుర్రా! ....పాపం
ఒకవేళ కాపీ దొరక్కపోతే మాకు వ్రాయండి

CROWQUILL
HASYA PRIYA
2-2-1109/3/6
Bagamberpet, Hyderabad-500 013.